
'బీసీ ఆత్మగౌరవ భవనాలు' పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి తలసాని

# బీఆర్ఎస్ బీసీల ప్రభుత్వం

## మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

### 'బీసీ ఆత్మగౌరవ భవనాలు' పుస్తకావిష్కరణ

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : బీసీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలుపర్చారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ రాసిన 'బీసీ ఆత్మగౌరవ భవనాలు' పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్మాణాత్మకంగా కృషి చేస్తూ వస్తుందని అన్నారు. చేతి వృత్తుల జీవితాలకు భరోసా కల్పించామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీలకు ఆత్మగౌరవ భవనాలు కట్టించామని తెలిపారు. మత్స్య, నేత, గీత, యాదవ, రజక, నాయీ బ్రాహ్మణ, విశ్వకర్మ, అత్యంత వెనుకబడిన బీసీ వర్గాలను ఆదుకున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చేతివృత్తుల వారికి లక్ష రూపాయలు అందించామని తెలిపారు. బీసీలకు అండగా నిలిచిన ప్రభుత్వానికి బహుజనులు కూడా అండగా నిలుస్తారని చెప్పారు. బీజేపీ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాటలు పచ్చి బూటకమని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు బీసీ ఓట్ల మీద ఉన్న శ్రద్ధ బీసీల జీవన ప్రమాణాలు పెంచడంపై లేదని మండిపడ్డారు. బీసీ జనగణన చేయమంటే పట్టించుకోని బీజేపీ, కాంగ్రెస్‌లు బీసీలకు మేలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నదని తెలిపారు. మొదట కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీలు అంబానీ, ఆదానీ లాంటి వారికి రక్షకులుగా మారారనే తప్ప.. 'సంపద పెంచడం, సంపద పంచడం'పై కనీస ఆలోచన చేయలేని విమర్శించారు. రచయిత జూలూరు మాట్లాడుతూ.. బహుజనులకు సాయం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనిక ఆలోచనలకు ఆచరణ రూపంగా బీసీలు నిలిచి తీరుతారని, కేసీఆర్ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా ఉంటారని అన్నారు.

## విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ

సత్తుపల్లి టౌన్, అక్టోబర్ 29: సత్తుపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్న విద్యార్థిని జి.త్రిలోచనకు ఆదివారం రూ.38వేల విలువైన ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కొందరు దాతలు, విద్యాభారతి, నవభారత్ జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యం, పీడీజీ కాపా మురళీకృష్ణ(లయన్స్ విద్యా ట్రస్టు చైర్మన్) సహాయంతో ల్యాప్‌టాప్ అందజేశారు. కార్యక్రమంలో దొడ్డా కృష్ణయ్య, పెనుగొండ రమేష్, జీవీ.లింగారెడ్డి, గంగ్రి సోమిరెడ్డి, జంగా సత్యనారాయణ, సింగరేణి రవి, ఒగ్గు దామోదర్‌రెడ్డి, జక్కం ప్రసాద్, గోలి ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తల్లాడ, అక్టోబర్ 29: మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన ప్రసాద్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1993–94 తల్లాడ జడ్పీఎస్ఎస్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రసాద్ భార్య మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం రూ.30,500 నగదు అందజేశారు. ఈ నగదును యూనివర్సల్ స్కూల్ కరస్పాండెంట్ ప్రసన్న చేతుల మీదుగా కుటుంబసభ్యులకు అందజేశారు. మరో స్నేహితుడు బోలే షావాలి అనారోగ్యంతో ఉండడంతో రూ.80వేలు అందజేశారు. నీలం కిరణ్, సైదులు, సుధారాణి, శుభాషిని, నగేష్, చాంద్ పాషా, రంగారావు, రఘు, వెంకటేశ్వర్లు, రాజా, నరసింహారావు పాల్గొన్నారు.

# పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తుల సందడి

పాల్వంచ, అక్టోబర్ 29 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తులు అధికసంఖ్యలో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే పరిసర గ్రామాలేకాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. తమను చల్లంగా చూడాలని వేడుకుంటూ బోనాలు సమర్పించారు. అన్నప్రాసనలు, వాహనపూజలు, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం, చీరెలు, కనుములు తదితర మొక్కులను చెల్లించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో త్వరలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు అమ్మవారి భక్తులు ఇల్లెందు కోర్టు ఏరియాకు చెందిన కటకం వెంకటేశ్వర్లు, వరలక్ష్మి దంపతులు రూ.5116 విరాళం అందించారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న జిల్లా సివిల్ జడ్జి


అమ్మవారిని దర్శించుకొని పూజలు చేస్తున్న భక్తులు

### అమ్మవారి సన్నిధిలో జిల్లా సివిల్ జడ్జి

పెద్దమ్మతల్లి అమ్మవారిని జిల్లా సివిల్ జడ్జి బత్తుల రామారావు ఆదివారం కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అర్చకులు వారికి శేషవస్త్ర ప్రసాదం అందజేశారు. ఆలయ ఈవో రజనీకుమారి, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మహిపతి రామలింగం, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు పాల్గొన్నారు.

# సింగరేణిలో పేరెంట్స్ ట్రీట్‌మెంట్ వివరాలను ఆన్‌లైన్ చేయాలి

రామవరం, అక్టోబర్ 29 : సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగుల తల్లిదండ్రులకు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం కోసం మైన్‌లు, డిపార్ట్‌మెంట్‌లో అధికారుల సంతకాలు తీసుకొని రమ్మని తిప్పడంతో వైద్యం సరిగా అందక ఇబ్బంది పడుతున్నారని, ప్రస్తుత సింగరేణిలో ప్రతిదీ డిజిటలైజేషన్ చేస్తున్నందున తల్లిదండ్రుల ట్రీట్‌మెంట్ పేపర్లపై అధికారుల సంతకాలు లేకుండా డిజిటలైజ్ చేయాలని టీబీజీకేఎస్ రీజినల్ సెక్రటరీ కూసన వీరభద్రం అన్నారు. రామగుండం1 ఏరియాలో ఆదివారం జరిగిన టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అనుబంధ సంస్థ టీబీజీకేఎస్ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేస్తామన్నారు. కోల్‌బెల్టు ఎమ్మెల్యేలను తప్పక గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను కలిసి 32 శాతం లాభాల వాటా ఇప్పించడంలో కృషి చేసినందుకు కార్మికుల తరపున పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కూసన వీరభద్రం

# శిక్షణా తరగతులకు పీవో, ఏపీవోలు హాజరుకావాలి

## కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : పోలింగ్ ప్రక్రియలో భాగంగా ఈ నెల 30 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు ఆయా నియోజకవర్గకేంద్రాల్లో నిర్వహించనున్న శిక్షణా తరగతులకు పీవో, ఏపీవోలు విధిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. విధులకు గైర్హాజరైతే ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 8:45 గంటలకు పీవోలు, ఏపీవోలు వారికి కేటాయించిన శిక్షణ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో మూడ్రోజులు, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో రెండ్రోజులు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

## ఘనంగా కుమ్రంభీం వర్ధంతి


కుమ్రంభీం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

జూలూరుపాడు, అక్టోబర్ 29 : మండల కేంద్రంలోని కుమ్రంభీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కుమ్రంభీం వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని కుమ్రంభీం విగ్రహానికి ఆ సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కుమ్రంభీం ఫౌండేషన్ నాయకులు తెల్లం నర్సింహారావు, బచ్చల లక్ష్మయ్య, భూక్యా రమేశ్, తెల్లం మహేశ్, వీరభద్రరావు, గోపాలరావు, కొడెం సీతాకుమారి పాల్గొన్నారు.

# వనమా గెలుపు కోసం టీబీజీకేఎస్ శ్రేణుల ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణులు

రామవరం, అక్టోబర్ 29 : కొత్తగూడెం ఎమ్మెల్యే నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపు కోసం ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో టీబీజీకేఎస్ శ్రేణులు పాల్గొన్నారు. రుద్రంపూర్, గౌతంపూర్, ధన్బాద్ ఏరియాల్లో బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ పిట్స్, బ్రాంచ్, జీఎం స్ట్రక్చర్, సెంట్రల్ కౌన్సిల్ శ్రేణులు, ప్రజలు వనమాకు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా వాల్మీకి జయంతి


జయంతి వేడుకల్లో సంఘ బాధ్యులు

సత్తుపల్లి రూరల్, అక్టోబర్ 29: మండల పరిధిలోని సదాశివుని పాలెంలో వాల్మీకి జయంతిని ఆదివారం వాల్మీకి బోయ సంఘం నాయకులు నిర్వహించారు. సర్పంచ్ తుంబూరు సరస్వతి మాట్లాడుతూ వాల్మీకి బోయలను ఎస్టీలుగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సాకి శరణయ్య, సాకి వెంకటేష్, సాకి వెంకయ్య, కనికంటి వెంకటేశ్వరరావు, కనికంటి శ్రీను, సాకి కొండలు, సాకి శ్రీనివాసరావు, నల్లబోతుల నాగరాజు, సాకి నాగేశ్వరరావు, కిష్టా శివప్రసాద్, కల్యాణిస్వామి, తూకదుద్ది మారేశ్వరరావు, నాగలక్ష్మి, చొప్పరి మారేశ్వరరావు, చొప్పరి శ్రీను, ధనమ్మ, దామోదర్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రమేశ్ పాల్గొన్నారు.